ప్రజాశక్తి
ఆదివారం 9 నవంబర్ 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఐదేళ్లుగా అలంకారమే!

- పని చేయని సిటిస్కాన్
- జిల్లా వైద్యశాలలో అరకొర వసతులు
- రోగులకు తప్పని కష్టాలు



డెల్టా ప్రాంతంలో పేదల వైద్యానికి పెద్దదిక్కుగా ఉన్న జిల్లా వైద్యశాలలో సమస్యలు పేరుకుపోతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారు. వైద్యశాలలో అతి ప్రాముఖ్యమైన సిటిస్కాన్ దాదాపు ఐదేళ్లుగా అలంకారప్రాయంగానే ఉంది. దీంతో ప్రజలు ప్రైవేట్ ల్యాబులను ఆశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. తెనాలిలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో నెలకొన్న ఇబ్బందులు ఇలా ఉన్నాయి.

ప్రజాశక్తి తెనాలి

తెనాలిలోని జిల్లా వైద్యశాల దాదాపు 10 మండలాల పేదలకు వైద్య సేవలు అందిస్తోంది. తెనాలి, కొల్లిపర, వేమూరు, కొల్లూరు, చుండూరు, చేబ్రోలు, దుగ్గిరాల, అమృతలూరు మండలాలకు చెందిన పేదలు వైద్య సేవలకు ఆశ్రయించేది ఈ జిల్లా ప్రభుత్వ వైద్యశాలనే. ప్రతిరోజు ఓపీ 800 నుంచి 1100 వరకు ఉంటుంది. వైద్యశాలలో తల్లీపిల్లల వైద్య సేవల విభాగం వేరుగా ఉంది. ఆసుపత్రి మొత్తం మీద 350 పడకలు అందుబాటులో ఉన్నాయి. ప్రసూతి విభాగంతో పాటు, ఎముకలు కీళ్లు, చెవి, ముక్కు, గొంతు, కంటి విభాగం, ఎఆర్టి సెంటర్, టిబి యూనిట్ ఉన్నాయి. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలకు గురైనవారు అత్యవసరంగా తెనాలిలోని జిల్లా ఆస్పత్రినే ఆశ్రయిస్తారు.

అయితే రాత్రి సమయంలో ఎలాంటి కేసులు వచ్చినా వారిని 2లో

10, 11 తేదీల్లో గుంటూరులో జాతీయ స్థాయి సదస్సు

ప్రజాశక్తి–గుంటూరు

గుంటూరులో జాతీయస్థాయి సదస్సు ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు రూరల్ మండలం, వెంగళాయపాలెంలో 11వ తేదీన జరగనున్న వాటర్‌షెడ్ మహోత్సవ్ ఏర్పాట్లను రాష్ట్ర పంచాయతీరాజ్ సంచాలకులు మైలవల్లి కృష్ణతేజ, జిల్లా కలెక్టర్ తమీమ్ 2లో



జెఎన్‌యులో లెఫ్ట్ ప్యానల్ విజయంపై హర్షం

ప్రజాశక్తి – ఎఎన్‌యు : ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో వామపక్ష విద్యార్థి సంఘాల ప్యానల్, పాండిచ్చేరి యూనివర్సిటీలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) విజయం సాధించిన సందర్భంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా వర్సిటీలో శనివారం కేక్ కట్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.కిరణ్ మాట్లాడుతూ దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మమైన జవహర్లాల్ నెహ్రూ యూనివర్సిటీలో మతోన్మాద శక్తులను లెఫ్ట్ ప్యానల్ ఓడించిందన్నారు. ఇందుకు జెఎన్‌యు ఎస్‌ఎఫ్‌ఐ కమిటీకి విప్లవాభినందనలు తెలిపారు. దేశంలో వామపక్ష విద్యార్థి సంఘాల వైపు విద్యార్థులు చూస్తున్నారని, పెట్టుబడిదారీ వ్యవస్థ నుంచి సోషలిజం వైపునకు విద్యార్థులు మళ్లుతున్నారని చెప్పారు. రానున్న రోజుల్లో విద్యార్థి పోరాటాలు బలంగా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ వర్సిటీ అధ్యక్షులు కె.రూపస్, గర్ల్స్ కన్వీనర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.


గెలుపొందిన క్రీడాకారులతో సెలక్షన్ కమిటీ సభ్యులు

జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని వెనిగండ్ల జెడ్పి పాఠశాలలో రెండ్రోజులపాటు నిర్వహించిన 69వ ఎస్‌జిఎఫ్ మాల్కం అండర్-14, 17, 19 బాలబాలికల ఇంటర్ డిస్ట్రిక్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. పోటీల రాష్ట్ర పరిశీలకులు శేఖర్‌రాజు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 10 జిల్లాల నుండి 180 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, నలుగురు సభ్యులతో సెలక్షన్ కమిటీని ఏర్పాటు చేసి వివిధ విభాగాల్లో టోర్నమెంట్ నిర్వహించి 20 మంది క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశామని తెలిపారు. వివిధ విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎన్.తిరుపతిరావు, ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రటరీలు గోపి, శిరీష, ఉపాధ్యాయులు కొండయ్య, లక్ష్మీపతి, మాధవి, రాణి పాల్గొన్నారు.

ఆవుల యజమానులకు తుది హెచ్చరిక

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కి తీవ్ర ఆటంకంగా ఉంటున్న ఆవులు, ఎద్దులు, దూడలను ఈనెల 10వ తేదీ నుండి వెంగళాయపాలెంలోని జిఎంసి బందెలదొడ్డికి తరలిస్తున్నామని, ఆయా పశువులను వాటి యజమానులు రోడ్ల మీదకు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని నగరపా లక సంస్థ కమిషనర్ పి.శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో కోరారు. రహదారులపై పశువులు విచ్చల విడిగా ఉండడం వలన వాహనదార్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని సమయాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే పలుమార్లు పశువులను రోడ్ల మీదకు వదిలితే తగు చర్యలు తీసుకుంటా మని తెలియచేసినా యజమానులు నిర్లక్ష్యంగా ఉంటున్నా రని, రోడ్లమీద ఉండే ఆవులు, ఎద్దులు, దూడలను ప్రజా ప్రయోజనం దృష్ట్యా జిఎంసి బందెలదొడ్డికి తరలించాలని ప్రజారోగ్య అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. బందెలదొడ్డికి తరలించిన పశువులను విడుదల చేయబోమని, భారీ అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పశువుల యజమానులు వాటిని రోడ్ల మీదకు రాకుండా చూసుకోవాలని, ప్రజలు ఎవరైనా రోడ్ల మీద పశువుల వల్ల సమస్య ఎదుర్కొంటే జిఎంసి కాల్ సెంటర్ 08632345103కు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.

సత్రశాల ఆలయంలో అన్నదానం

ప్రజాశక్తి - రెంటచింతల

కార్తీక మాసాన్ని పురస్కరించుకుని కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలోని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామి ఆలయంలో శనివారం 1200 మందికి అన్నదానం చేసినట్లు ఎండోమెంట్ ఈవో గాదె రామిరెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ జీవీ శివయ్య తెలిపారు. అన్నదానం చేసిన పెరుమాళ్ళ టాటారావు, కోటేశ్వరీ, చంద్రశేఖర్, లక్ష్మీసుజాత దంపతులతో పాటు పవర్ ప్లాంట్ సిబ్బందిని అభినందించారు.

జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై దాడిని ఖండిస్తూ ఢిల్లీలో 20 మహాధర్నా

ప్రజాశక్తి - మంగళగిరి

భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై ఇటీవల జరిగిన దాడిని ఖండిస్తూ, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఢిల్లీలో మహాధర్నాను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ శనివారం ఆవిష్కరించారు. 20న ఉదయం 10 గంటలకు ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ధర్నా ఉంటుందని, దళిత, బహుజన సంఘాల ప్రతినిధులు హాజరవుతారని చెప్పారు.

ఐదేళ్లుగా అలంకారమే!


(మొదటి పేజీ తరువాయి)

గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)కు తరలిస్తున్నారని, నామమాత్రపు చికిత్సకు కూడా ప్రాధాన్యం ఇవ్వటం లేదని పలువురు రోగులు వాపోతున్నారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాద బాధితులకు అధిక శాతం సిటీ స్కాన్ అవసరమవుతుంది. ఆసుపత్రిలో సిటీస్కాన్ సౌకర్యం ఉన్నా ఉపయోగం లేదు. ఐదేళ్ల క్రితం మరమ్మతులకు గురైనా అధికారులు పట్టించుకోలేదు. ఖరీదైన వైద్యసేవ కావడంతో రోగులు ప్రైవేటు ల్యాబులను ఆశ్రయించి ఆ భారం భరించలేకపోతున్నారు. ప్రభుత్వం పేదల వైద్యానికి రూ.కోట్లు వెచ్చిస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా సిటీ స్కాన్ పరికరాన్ని అందుబాటులోకి తేవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

వెంటిలేషన్ నిల్ .....

ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లో గ్లాస్ విండోస్ ఏర్పాటు చేసి పూర్తిగా మూసి ఉంచుతున్నారు. రోగుల వద్దకు సందర్శకులు వచ్చి పోయే సందర్భాలు అనేకం. ఈ పరిస్థితుల్లో బయట గాలి లోపలికి రాకుండా, లోపలిగాలి బయటికి వెళ్లకుండా కిటికీలు మూసి ఉంచటం ఎంతో ఇబ్బందికరంగా ఉంటోంది. వెంటిలేషన్ సౌకర్యం ఉన్నప్పటికీ వినియోగించకుండా మూసి ఉంచటం రోగులను, సందర్శకులను మరింత అనారోగ్యానికి దిగజార్చుతోందని రోగులు, వారి బంధువులు అంటున్నారు.

విధిలేని పరిస్థితుల్లో బయటకు..

కూచిపూడి, అమృతలూరు మండలం, బాపట్ల జిల్లా.



నా భార్య కడుపునొప్పితో బాధపడుతోంది. అమృతలూరు మండలం కూచిపూడి నుంచి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి వచ్చాం. స్కాన్ చేయించమని వైద్యులు చెప్పారు. ఆసుపత్రిలో సిటి స్కాన్ పనిచేయడం లేదంటున్నారు. విధిలేని పరిస్థితిలో బయటకు వెళ్లాల్సి వస్తుంది. గతంలో కూడా ఏ పరీక్షలు అవసరమైనా బయటికి పంపించారు. సిటీస్కాన్ అందుబాటులోకి తెస్తే మాలాంటి పేదలకు మేలు.

మత్తు ఇచ్చారు.. స్కాన్ పనిచేయటం లేదన్నారు

మనోరమ, రోగి భార్య, రేపల్లె, బాపట్ల జిల్లా.



నా భర్తకు ఆరోగ్య సమస్యలున్నాయి. రేపల్లె వైద్యశాలకు వెళితే తెనాలి పంపించారు. స్కాన్ తీస్తామంటూ రెండుసార్లు మత్తు ఇచ్చారు. తరువాత సిటిస్కాన్ పనిచేయటం లేదని చెబుతున్నారు. ఏం చేయాలి. బయట ప్రైవేటు వ్యక్తుల వద్ద స్కాన్ చేయించాలంటే మావద్ద అంత డబ్బు లేదు.

ఐదేళ్లుగా సిటి స్కాన్ పనిచేయడం లేదు

డాక్టర్ సౌభాగ్యవాణి, సూపరింటెండెంట్.



ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఒకరిద్దరూ సిబ్బంది తగ్గినా త్వరలో అవి భర్తీకానున్నాయి. ఆసుపత్రిలో సిటీ స్కాన్ 2021 నుంచి మరమ్మతులో ఉంది. ఇటీవలే కొత్త సిటీ స్కాన్ పరికరం కోసం ఉన్నతాధికారులకు నివేదించాం. టెండర్ దశలో ఉంది. అది అందుబాటులోకి వస్తే సిటీ స్కాన్ కొరత తీరుతుంది. భవిష్యత్తులో రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తాం.

పెద్ద చెరువులను గుర్తించండి : కేంద్ర మంత్రి

ప్రజాశక్తి-గుంటూరు

ఉపాధిహామీ కింద చేపడుతున్న పనుల్లో భాగంగా జిల్లాలో పెద్ద చెరువులను గుర్తించాలని సంబంధిత అధికారులను కేంద్ర కమ్యూనికేషన్లు, గ్రామీణ అభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆదేశించారు. జాతీయ ఉపాధి హామీ, గృహ నిర్మాణం, గ్రామీణ అభివృద్ధి సంస్థ కార్యక్రమాలపై శనివారం కలెక్టరేట్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద చెరువులను గుర్తించి, వాటిని అందంగా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. పెద్ద చెరువులు నీటి పరిరక్షణకు ఎంతగానో తోడ్పడతాయని చెప్పారు. వాటి వద్ద వాకింగ్ ట్రాక్‌లు వంటివి ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఎక్కువ ఉపయోగం ఉంటుందని అన్నారు. ఉపాధి హామీ పనుల సుస్థిర ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వేతనదారులు అందరికి ఈకెవైసీ పూర్తి చేయలని అన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఉపాధి హామీ గొప్ప వరమని పేర్కొన్నారు. మెటీరియల్ కాంపోనెంటు ఎక్కువగా జనరేట్ చేయడానికి ప్రయత్నించాలని తద్వారా జిల్లాలో మౌలిక సదుపాయాలను కల్పించుటకు అవసరమగు నిధులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. జిల్లాలో స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ క్లస్టర్లను ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైన నివేదికలు అందించాలన్నారు. గుంటూరు జిల్లా పచ్చళ్ల తయారీకి ప్రసిద్ధి చెందిందని, అందుకుగాను కొన్ని ఉత్తమ స్వయం సహాయక సంఘాలను క్లస్టర్‌గా ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున పచ్చళ్ళు తయారు చేయడానికి చర్యలు చేపట్టాలని అన్నారు. ఉత్తమ పనితీరు కనబరిచే స్వయం సహాయక సంఘాలకు ప్రోత్సాహకాలు ఇచ్చే విధంగా ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్ మాట్లాడుతూ జిల్లాలో 15 మండలాల్లో 234 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. 31 లక్షల పని దినాలను కల్పించడం జరిగిందని చెప్పారు. అమృత్ సరోవర్ మొదటి దశలో 74 చెరువులను ప్రారంభించి పూర్తి చేశామని, రెండవ దశలో 25 చెరువులను మంజూరు చేశామని, ఇప్పటికే రెండు పూర్తి చేశామని తెలిపారు. జిల్లాలో 1,40,000 జాబు కార్డుదారులకు ఈకేవైసీ పూర్తి చేశామన్నారు. 1498 పంట గుంతలను మంజూరు చేయగా ఇప్పటి వరకు 242 పూర్తి చేశామని, రైతులు పంట కుంటలు ఏర్పాటుకు ముందుకు రావాల్సిన అవసరం ఉందని వివరించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఉప్పునీరు వస్తుందని అటువంటి ప్రాంతాల్లో పంట కుంటలు ఏర్పాటు చేయడం వల్ల మంచినీరు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటుందని, దీన్ని ప్రజలు గమనించాలని కోరారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ సి.పి.రెడ్డి, డిఆర్ఒ ఖాజావలి పాల్గొన్నారు.

టెక్నాలజీతో పాటు నైతికత అత్యవసరం : జస్టిస్ చలమేశ్వర్



ప్రజాశక్తి-గుంటూరు

న్యాయ పరిపాలనా వ్యవస్థలు ప్రజల అంచనాలకు తగినవిధంగా పనిచేయాలంటే టెక్నాలజీతో పాటు నైతికత, మానవత్వమూ అంతే అవసరమని జస్టిస్ జాస్తి చలమేశ్వర్ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ప్రోబోనో లీగల్ సర్వీసెస్ సహకారంతో 'కృత్రిమ మేధస్సు, సాంకేతిక యుగంలో న్యాయ సహాయం, న్యాయం అందుబాటులోకి తేవడం' అనే అంశంపై ఒకరోజు అంతర్జాతీయ సదస్సు శనివారం నిర్వహించారు. తొలుత యూనివర్సిటీలోని ఎన్‌టీఆర్ లైబ్రరీలో తన పేరుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సెక్షన్‌ను ఆవిష్కరించిన జస్టిస్ చలమేశ్వర్ మాట్లాడుతూ మాట్లాడుతూ ఎఐ, టెక్నాలజీ న్యాయరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నప్పటికీ, అవి ఎప్పటికీ న్యాయవాదులుగానీ, న్యాయమూర్తుల స్థానాన్ని భర్తీ చేయలేవని స్పష్టం చేశారు. ఎఐ వ్యవస్థలు పరిశోధన, డ్రాఫ్టింగ్, పరిపాలనలో సహకరించినా, న్యాయసారం మాత్రం మానవ ఆలోచన, విశ్లేషణ, దయ, నైతిక తీర్పులోనే ఉంటుందని వివరించారు. 'న్యాయం అంటే కేవలం చట్టపరమైన అర్థమే కాదని, అది మానవ మనసు, దయ, సమానత్వం, బాధ్యతల సమ్మేళనం,' అని అన్నారు. పేదవర్గాలకు న్యాయసహాయం చేరేలా అవగాహన కార్యక్రమాలు, సులభ న్యాయసేవలు, డిజిటల్ సదుపాయాలు విస్తరించాల్సిన అవసరాన్ని చెప్పారు. ఎపి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు మాట్లాడుతూ టెక్నాలజీ శక్తివంతమైన సాధనమని, కానీ దాని విలువ మానవ సేవలోనే ఉందన్నారు. భారత న్యాయవ్యవస్థ వేగంగా డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. ఈ-కోర్ట్స్, పేపర్ ఫ్రీ కోర్ట్స్ వంటి పథకాలు న్యాయ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మారుస్తున్నాయని అన్నారు. సీబీఐ ఎఐ ఆధారంగా సాక్ష్యాల పరిశీలన జరపడం దర్యాప్తు నాణ్యతను పెంచుతోందని చెప్పారు. లాన్‌నెట్‌వర్కింగ్, ఆన్‌లైన్‌కేసు ట్రాకింగ్ సిస్టమ్, ప్రజలకు అందుబాటులో ఉన్న వెబ్ పోర్టల్స్ పారదర్శకతను పెంచుతున్నాయని వివరించారు. లావు రత్తయ్య మాట్లాడుతూ ఏఐ ఇప్పుడు కేవలం సాంకేతిక రంగాలకే పరిమితం కాలేదని, అది న్యాయం అందించే విధానాన్నీ ప్రభావితం చేస్తోందని పేర్కొన్నారు. డిజిటల్ లీగల్ అసిస్టెంట్లు, ఆన్‌లైన్ వివాద పరిష్కార వేదికలు, ఆటోమేటెడ్ డాక్యుమెంటేషన్ వంటి ఏఐ సాధనాలు సాధారణ ప్రజలకు న్యాయ సహాయాన్ని మరింత సులభతరం, చౌకగా, పారదర్శకంగా చేస్తాయని తెలిపారు. అయితే, టెక్నాలజీని చట్ట వ్యవస్థ అనుసంధానించేటప్పుడు నైతిక విలువలు, మానవ బాధ్యతలు, డేటా భద్రత వంటి అంశాలను కచ్చితంగా పరిగణించాలని హెచ్చరించారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



10, 11 తేదీల్లో గుంటూరులో జాతీయ స్థాయి సదస్సు

(మొదటి పేజీ తరువాయి)

అన్సారియా, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ సి.పి.రెడ్డి, గ్రామీణ అభివృద్ధి శాఖ వాటర్‌షెడ్ విభాగం సంచాలకులు వై.వి.కె.షణ్ముఖకుమార్‌తో కలిసి మంత్రి శనివారం పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సదస్సులో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి వాటర్‌షెడ్ - పిఎంకెఎస్‌వై జాతీయ సదస్సులో భాగంగా మొదటిరోజు గుంటూరులో ఐటిసి హోటల్లో ప్రారంభ కార్యక్రమం ఉంటుందని,. రెండవ రోజు వెంగళాయపాలెంలో జరుగుతుందని చెప్పారు. సమావేశంలో నగర కమిషనర్ పి.శ్రీనివాసులు, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, అదనపు ఎస్పీ రమణ మూర్తి, జెడ్పి సిఇఒ వి.జ్యోతి బసు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి.శంకర్, తహశీల్దార్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంధుల క్రికెట్ వరల్డ్ ఛాంపియన్ అజయ్‌కుమార్‌రెడ్డికి సత్కారం



ర్యాలీలో అజయ్‌కుమార్, ఎమ్మెల్యే, తదితరులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

భారత అంధుల క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, ప్రపంచ నంబర్ వన్ ఆల్‌రౌండర్ ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డిని శనివారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ సత్కరించారు. లూథ రన్ అంధుల ఉన్నత పాఠశాల పూర్వ, ప్రస్తుత విద్యార్థుల ఆధ్వర్యంలో టిడిపి నియోజకవర్గ కార్యాలయం నుంచి లూథరన్ అంధుల ఉన్నత పాఠశాల వరకు ర్యాలీ సాగింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ర్యాలీలో పాల్గొ న్నారు. భారతదేశానికి అంధుల క్రికెట్ ప్రపంచ కప్‌లను మూడుసార్లు అందించి, 2023లో అర్జున అవార్డు అందుకున్న అజయ్‌ను సత్కరించారు. 2002లో ఈ పాఠశాలలో చేరి విద్యాభ్యాసం పూర్తి చేసిన అజయ్, అక్కడే క్రికెట్ నేర్చు కుని జాతీయ స్థాయికి ఎదిగారు. బీ2 కేటగిరీ (పాక్షిక దృష్టి లోపం)లో ఆడుతూ 2016 నుంచి కెప్టెన్‌గా భారత్‌ను విజ యాల బాట పట్టించారు. 21 అంతర్జాతీయ టోర్నీలలో ఆడి 16 మ్యాన్ ఆఫ్ ద సిరీస్, 15 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలు, 213 వికెట్లు సాధించిన ఘనత అజయ్‌కుమార్ రెడ్డికి దక్కింది. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ మాట్లాడుతూ పల్నాడు ముద్దుబిడ్డ అజయ్‌కుమార్‌రెడ్డి అంధుల క్రికెట్ చరిత్రలో సువర్ణ అధ్యాయం సృష్టించారనీ, ఆయన విజ యాలు దివ్యాంగులకు స్ఫూర్తి అని ఈ సత్కారం ఆయన సేవలకు చిరస్థాయిగా నిలుస్తుందని కొనియాడారు. అజయ్ మాట్లా డుతూ విద్యాభ్యాసానికి ఆలవాలమైన ఈ పాఠశాల, నరసరావుపేట ప్రజలను నేను ఎప్ప టికీ మరచిపోనన్నారు. అర్జున అవార్డు, ప్రపంచ కప్‌లు అందరి సహకారంతోనే సాధ్యమయ్యా యని భావోద్వేగంతో తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, దివ్యాంగ క్రీడాకారులు పాల్గొని అజయ్‌ను అభినం దించారు. అంధుల క్రికెట్ ను ప్రోత్సహిం చాలని, దివ్యాంగులకు మరిన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు.

మిర్చిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన

ప్రజాశక్తి - క్రోసూరు

సత్తెనపల్లి ఉద్యాన అధికారి యన్. సురేష్ ఆధ్వర్యంలో క్రోసూరు మండలంలోని ఎర్ర బాలెం. పీసపాడు గ్రామాల పరిధిలో సాగులో ఉన్న మిరప పంటలను పరిశీలించారు. అనం తరం వారు మాట్లాడుతూ అధిక వర్షాల తర్వాత మిరపపంటలో తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మిరప తోటలో నీరు నిలబడి ఉండకుండా బయటకు వెళ్లే మార్గాలు ఏర్పరుచుకోవాలి, వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలని చెప్పారు. వడలిపోయిన మొక్కల కు లీటర్ నీటికి ఐదు గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి. ఆకులు ఇనుపు ధాతులోపం వలన పాలిపోయి ఉంటే 10 లీటర్ల నీటికి 50 గ్రాములు అన్న భేదితో పాటు నిమ్మ చెక్కరసంకలిపి పిచికారి చేయాలన్నారు.మొక్కల మధ్య సాళ్ళలో పై పాటుగా ఎకరాకి 50 కిలోల యూరియా 250 కిలోల వేప పిండి వేయాలి అలాగే నేల అదును వచ్చిన వెంటనే గొర్రు అంతర కషి చేయాలి. బ్యాక్టీరియా ఆకుమచ్చ, కోయినోఫోర వంటి తెగుళ్లు ఆశించే అవకాశం ఉన్నందున ముందు జాగ్రత్త చర్యగా పది లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్, గ్రాము స్ట్రెప్టోసైక్లిన్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలని తెలిపారు. ఎక్కడైనా మొక్కలు గ్యాప్ ఫిల్లింగ్ చేయాల్సిన అవసరం ఉంటే దగ్గర్లో ఉన్న నర్సరీ నుంచి ఆరోగ్యవంతమైన నారు తీసుకొని గ్యాప్ ఫిల్లింగ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఉద్యాన అధికారి యన్.సురేష్,రైతు సేవా కేంద్రం సిబ్బంది సౌజన్య, సుబ్బారావు మరియు మిరప సాగు చేయు రైతులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - తెనాలి



గుర్తు తెలియని మృతదేహం

పట్టణ త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి లోని రైల్వేస్టేషన్ సమీ పంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన వ్యక్తిని పోలీసులు గుర్తించారు. మృతుని వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉండ వచ్చునని తెలిపారు. శనివారం ఉదయం మృత దేహం జండా చెట్టు సమీపంలో ఉన్నట్లు స్థాని కులు తమ దృష్టికి తెచ్చారని పోలీసులు చెప్పా రు. మృతదేహాన్ని గుర్తించిన వారు త్రీటౌన్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

హత్య కేసులో ఆధారాలు సేకరణ

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండల కేంద్రం దుగ్గిరాలలోని రజక పేటలో శుక్ర వారం రాత్రి జరిగిన నీలాపు వీరయ్య అలియాస్ వీర బాబు హత్య జరిగిన ప్రదే శాన్ని శనివారం నేషనల్ ఫోరె న్సిక్ నిపుణులు, క్లూస్‌టీం పరిశీలించి ఆధారాలు సేక రించారు. మంగళగిరి టౌన్, రూరల్ ఇంచార్జ్ సిఐ వీర స్వామి తెలిపిన వివరాల ప్రకారం బలమైన సాక్ష్యాధా రాలు సేకరించటానికి చట్ట ప్రకారం అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. వీరయ్య మృతదేహానికి శని వారం తెనాలి ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వ హించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కౌలురైతు సంఘం నాయకులు

వాస్తవ సాగుదార్ల పేర్లు నమోదు చేయండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

తుఫాన్ కారణంగా పంటలు నష్టపోయిన వాస్తవ సాగుదార్ల పేర్లు నమోదు చేయాలని కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ డిమాండ్ చేశారు. సత్తెనపల్లి మండలం కందులవారి పాలెం గ్రామంలో పంట పొలాలను ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల వచ్చిన తుఫాన్ వల్ల ఆస్తి నష్టం పెద్దగా జరగకపోయినప్పటికీ పంట నష్టం తీవ్రంగా జరిగిందనీ, పత్తి, మిర్చి రైతులు, కౌలు రైతులు ప్రధానంగా నష్టపోయారన్నారు. తుఫాను వల్ల అత్యధికంగా నష్టపోయింది వాస్తవంగా సాగు చేస్తున్న కౌలు రైతులేనని పేర్కొన్నారు. పాలకుల దుర్మార్గ నిర్ణయాల వల్ల కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడంతో వారి పేర్లతో ఈ క్రాప్ నమోదు చేయటం లేదన్నారు. పంటలు సాగు చేయని భూ యజ మానులతోనే ఈ క్రాప్ నమోదు చేయడంతో కౌలు రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఈ క్రాప్ లోఎడిట్ ఆప్షన్ ఇచ్చి వాస్తవ సాగుదారుల పేర్లు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్యుమరేషన్‌లో నమోదు చేయని పంటలను కౌలు రైతులు పెట్టుకున్న అర్జీలను పరిగణలోకి తీసుకొని పంట పొలాలు పరిశీలించి నష్టాన్ని నమోదు చేయాలనీ, దీనికి గడువును పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. కౌలు రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తానన్న పెట్టుబడి సహాయం అన్నదాత సుఖీభవ పథకం వెంటనే అమలు చేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత విధి విధానాలను ప్రకటించి లబ్దిదారుల జాబితాను సచివాలయంలో ప్రకటించాలన్నారు. వ్యవసాయాధి కారులు కౌలు రైతులు నష్టపోకుండా క్షేత్ర స్థాయి వరకు ప్రభుత్వ నిర్ణయాలు అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు చలువాది లక్ష్మీనారాయణ సంఘం నాయకులు బగ్గీ వెంకటనారాయణ, మక్కపాటి నరసింహారావు. కౌలు రైతులు ఉన్నారు.



మాట్లాడుతున్న కోన రవికుమార్



సాఫ్టుబాల్ ఆడుతున్న క్రీడాకారుడు

అంతర్ జిల్లాల సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - సత్తెనపల్లి

12వ రాష్ట్ర సీనియర్ అంతర్ జిల్లాల సాఫ్ట్ బాల్ ఛాంపియన్షిప్ 2025 పోటీలను ధూళిపాళ్ళలోని లయోలా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఆముదాలవలస ఎమ్మెల్యే కోన రవికుమార్ ప్రారంభించారు. కార్యక్రమా నికి లయోలా కాలేజ్ డైరెక్టర్ వంశీ క్రిష్ణరెడ్డి అధ్యక్షత వహించారు. కోన రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడల పట్ల ఎక్కువ శ్రద్ధ చూపుతోందన్నారు. పుల్లల గోపీచంద్, పీవీ సింధు, కరణం మల్లేశ్వరి వంటి గొప్ప క్రీడాకారులను ప్రోత్సహించారని తెలిపారు. ఇటీవ డీఎస్సీ పోస్టింగుల్లో స్పోర్ట్స్ కోటా కింద నియామక పత్రాలు అందుకున్న 50 మందిని సన్మానించారు. ప్రతి ఒక్కరూ ఆటల మీద సమాజం పట్ల క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. కార్యక్రమానికి కొత్త సత్యనారాయణ, రమణ సాఫ్ట్ బాల్ స్టేట్ అసోసియేషన్ కన్వీనర్, షేక్ సిరాజుద్దీన్ రిటైర్డ్ డిఎస్‌డిఓ ఏలూరు, పల్నాడు జిల్లా డిఎస్‌డిఓ పి..నర్సింహారెడ్డి, పి.సామంత్ రెడ్డి, సెక్రటరీ సాఫ్టుబాల్ అసోసియేషన్ గుంటూరు, ఆవుల జనార్ధన్ యాదవ్, సెక్రటరీలు పాల్గొన్నారు.

సామాన్యుడికి చేరువలో చట్టం



విద్యార్థినులకు బహుమతులు అందజేస్తున్న న్యాయమూర్తులు

- విస్తరిస్తున్న న్యాయసేవల పరిధి
- ఉచితంగా వివాదాల పరిష్కారం
- నేడు న్యాయసేవాధికార దినోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

మనిషి నిద్ర లేచిన మొదలు నిద్రపోయే వరకూ, తల్లి గర్భంలో ఉన్న స్థితి నుండి మరణించే వరకూ చట్టం మన వెంటే ఉంటుంది. అన్ని వేళలా మనల్ని అంటినట్టు ఉన్నా మనదేశంలో చాలా మందికి చట్టానికి సంబంధించిన అంశాలు, ప్రజలకు లభించే హక్కులపై సరైన అవగాహన లేదు. దీని వల్ల అనేక ఇబ్బందులు, అన్యాయాలు, దోపిడీలకు గురవుతున్న సామాన్య ప్రజలకు రక్షణ కల్పించాలన్న ఉద్దేశంతో రాజ్యాంగంలో 39ఎ అధికరణంలో పేదలకు ఉచిత న్యాయసహాయం అనే అంశం పొందుపరిచారు. ఆర్టికల్ 39ఎ ప్రకారం న్యాయసేవాధికార చట్టాన్ని 1987లో అప్పటి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.ఎం.భగవతి అధ్యక్షతన ఇతర సుప్రీం కోర్టు న్యాయమూర్తుల కృషితో పార్లమెంట్‌లో చట్టం కోసం ప్రవేశపెట్టారు. ఆనంతరం 1995 నవంబర్ 9న ఈ చట్టం అమల్లోకి వచ్చింది. అప్పటి నుండి ఆరోజును న్యాసేవాధికార దినోత్సవంగా జరుపు కుంటున్నాము.

ప్రజలలో పెరుగుతున్న న్యాయ అవగాహన

న్యాయసేవాధికార చట్టం అమలులోకి వచ్చిన తర్వాత దేశంలో ప్రజలకు న్యాయపరమైన అంశాలపై అవగాహన పెరుగుతుంది. అందుకు సుప్రీం కోర్టు నుండి కింది స్థాయి న్యాయస్థానాల వరకూ కమిటీ ఏర్పాటు చేసి, న్యాయ సేవలను సామాన్యులకు చేరువ చేసేందుకు కృషి చేస్తు న్నారు. ఈచట్టం అమలుకు మండలస్థాయి నుండి జాతీయస్థాయి వరకూ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ కమిటీలను సుప్రీంకోర్టు నుండి స్థానిక కోర్టు వరకూ ఆయా న్యాయమూర్తులు పర్యవేక్షిస్తూ ఉంటారు. న్యాయసేవాధికార సంస్థ ముఖ్యంగా మూడు అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకొస్తుంది. న్యాయ సేవాధికార సంస్థ పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించటం, న్యాయ విజ్ఞాన సద స్సులు ఏర్పాటు చేయటం, లోక్ అదాలత్‌లు నిర్వహిస్తుంది. కక్షిదారులు తమ సమస్యలను లోక్ అదాలత్ సామరస్యపూర్వకంగా కేసులను పరిష్కరించుకుంటున్నారు. లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకుంటే ఆతీర్పునకు చట్టబద్ధత కల్పించారు. దీంతోపాటు ఆ తీర్పుపై ఉన్నత న్యాయస్థానానికి వెళ్లే అవకాశం లేదు. మరోవైపు పలు రకాలుగా న్యాయసహాయం దొరకక ఇబ్బంది పడుతున్న వివిధ బలహీన వర్గాల వారికి, ఆర్థిక స్థోమత లేనివారికి ఈ చట్టం ద్వారా ఉచితంగా న్యాయసహాయం అందిస్తున్నారు. ఈ చట్టాన్ని ఉపయోగించుకున్న వారు కోర్టు ఫీజులు కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. వీటితోపాటు సమస్యను ముందుగా పరిశీలించి, ప్రీలిటిగేషన్ ద్వారా కేసును రాజీ మార్గంలో పరిష్కరించటానికి కృషి చేస్తుంది.అంతేకాకుండా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్‌ను ఏర్పాటు చేసి, ఎల్ఎడిసికు ఎంపికైన న్యాయవాదుల ద్వారా క్రిమినల్ కేసులలో న్యాయసహాయం అందక ఇబ్బంది పడుతున్న రిమాండ్ ఖైదీలకు, అవసరం అయిన పేద వారికి సేవలు అందిస్తున్నారు. నిరుపేదలకు కోర్టు బెయిల్ వచ్చిన తర్వాత షూరిటీ అమౌంట్ కట్టుకోలేని వారికి విచారించి వారికి ప్రభుత్వం ద్వారా షూరిటీ అమౌంట్‌ను డిపాజిట్ చేయిస్తున్నారు. నల్సా స్కీమ్ కింద బాధితులకు అనేక సహాయ సహకాలు అందిస్తున్నారు. న్యాయసేవల దినోత్సవం సందర్భంగా శుక్రవారం గుంటూరు జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.





జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికళ్యాణ్ చక్రవరి, న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి సయ్యద్ జియాఉద్దీన్

సివిల్ కేసుల పరిష్కారంలో దేశంలో ప్రధమస్థానం

జిల్లా స్థాయిలో జిల్లా న్యాయసేవాధికార సంస్థకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి చైర్మన్‌గా, సీనియర్ సివిల్ జడ్జి కార్యదర్శిగా ఉంటారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి.సాయికళ్యాణ చక్రవర్తి కృషి ఫలితంగా లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు దేశంలోనే ఎక్కువగా పరిష్కరించి గుంటూరు ప్రధం స్థానంలో నిలిచింది. రెవెన్యూ శాఖకు చెందిన భూవివాదాలు, వినియోగదారులకు చెందిన కేసులు, సర్వీసు, ట్రాఫిక్, పారిశ్రామిక, అటవీశాఖ, టెలీఫోన్, మున్సిపల్ కార్పొరేషన్, స్వల్ప క్రిమినల్ కేసులు, రాజీ పడతగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, మోటారు యాక్సిడెంట్ కేసులు 2024 నవంబర్ నుండి 2025 నవంబర్ వరకూ ఎక్కువ సంఖ్యలో కేసులు రాజీ చేశారు. పరిష్కరించిన కేసులకు సంబంధించి కక్షిదారులు రూ.279,43,06794లు లబ్ధిపొందారు.

ఏడాది కాలంలో సేవలు

నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లు	4
సివిల్ కేసులు, బ్యాంకు కేసులు	2920
ప్రీలిటిగేషన్ కేసులు	348
క్రిమినల్ కేసులు	29617
లీగల్ లిట్రసీ క్యాంప్‌లు	1335
మెగా లీగల్ లిట్రసీ మాడ్యుల్ క్యాంప్‌లు	1
న్యాయసహాయం పొందిన వారు	1103
బాధితులకు పరిహార స్కీమ్ కింద	రూ.17 లక్షలు
లీగల్ ఎయిడ్ డిఫెన్స్ సిస్టమ్‌లో పరిష్కారమైన కేసులు	133

భారీ వాహనాలను గ్రామంలోకి రాకుండా చర్యలు చేపట్టండి

ఎమ్మెల్యేకు సిపిఎం నాయకుల వినతి



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - అమరావతి

గ్రామంలో నుంచి వెళ్తున్న భారీ వాహనాలను దారి మళ్లించాలని సిపిఎం నాయకులు ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే భాష్యం ప్రవీన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన అమరావతికి దేశ విదేశాల నుంచి నిత్యం అమరేశ్వర గుడి, బౌద్ధ మ్యూజియాన్ని నిత్యం ప్రజలు, టూరిస్టులు సందర్శి స్తుంటారనీ, పట్టణంలోని ప్రధాన రహదారిపై నుంచి భారీ ఇసుక లారీలు వెళ్తుండడంతో ఏ క్షణంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయపడుతున్నారని చెప్పారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో గొర్రెలు, మేకలు, గేదలు, ఆవులు, పశువుల కాపరులు ఇదే రోడ్డుపైన వెళ తుంటారని చెప్పారు. విద్యార్థులు సైకిల్ మీద, ఆటోలో స్కూలుకు వెళ్లే ప్రధానమైన రహదారిలో భారీ ఇసుకలారీలు లోడ్లతో వెళుండడంతో పాదచారులు ఇబ్బందులకి గురవు తున్నారని చెప్పారు. భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా 2014 లో రింగురోడ్డు ఏర్పాటు చేశారనీ, అయితే ఏడాది నుంచి పట్టణంలోంచి వెళ్తున్నాయనీ, వాటిని దారి మళ్లించాలని ఎమ్మెల్యేని కోరామని చెప్పారు. ఎమ్మెల్యే స్పం దించి చర్యలు తీసుకుంటామని చెప్పారని తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిపిఎం నాయకులు ఎసిటి మహెూదిన్వలి వెంకటేశ్వరరాజు ఎస్ కే రఫీ, రాజకుమార్ పాల్గొన్నారు. ఇటీవల మొంథా తుఫాను వలన నష్టపోయిన రైతులు, కౌలు రైతులకి సమగ్రమైన సర్వే చేసి నష్టపరి హారం అందించాలని కోరినట్లు చెప్పారు.

మత్స్యకారుల ఉన్నతికి ఊతం

ప్రజాశక్తి - విజయపురిసౌత్ : మండల పరిధిలో పెద్ద అనుపు వద్ద ఉన్న కృష్ణా జలాల్లో మత్స్యశాఖ ఆధ్వర్యంలో 6.20 లక్షల చేప పిల్లలను శనివారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, గురజాల ఆర్డీవో మురళీ, మత్స్యశాఖ డీఎఫ్‌వో సంజీవ్‌రావు విడిచి పెట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో మత్స్యకార సంక్షేమాన్ని గాలికొది లేసి, దాదాపు 11 రకాల సంక్షేమ పథకాలను రద్దు చేసిన ఘనుడు జగన్‌రెడ్డి అని అన్నారు. వేట నిషేధం సమయంలో అందిస్తున్న రూ.10 వేల సాయాన్ని కూటమి ప్రభుత్వం రూ.20 వేలకు పెంచిందన్నారు. తహశీల్దార్ కిరణ్ కుమార్, ఎస్సై అశోక్, మత్స్యశాఖ ఇన్‌స్పెక్టరు శ్రీనివాసరావు, పి.వెంకట్రావు, మత్స్యకార సంఘం అధ్యక్షులు అప్పలరాజు, సభ్యులు దేవుడు, నర్సింహులు, సింహాద్రి, భూలోక్, టిడిపి మండల అధ్యక్షుడు వీరాస్వామి యాదర్, మాజీ జెడ్పిటిసి ఎస్.గోపిరెడ్డి, కోటయ్య, వెంకటేశ్వర్లు, వీరస్వామి, స్వామీ నాయక్ పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి జగ్గారావు

పురుగుమందుల దుకాణాల్లో తనిఖీ

ప్రజాశక్తి - నకరికలు

రైతులు కొనుగోలు చేసే పురుగుమందులు ఎరువులు విషయంలో ఎటువంటి అనుమానాలు ఉన్న వ్యవసాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని పల్నాడు జిల్లా వ్యవసాయాధికారి జగ్గారావు తెలిపారు. నకరికల్లులోని పురుగు మందులు దుకాణాలను శనివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా సోర్స్ ఆఫ్ సప్లై, బిల్ బుక్స్, స్టాక్ రిజిస్టర్లు, ఐఎఫ్ఎంఎస్ మిషన్ స్టాక్ రిపోర్టులను పరిశీలించారు. అనంతరం రైతులు కొనుగోలు చేసిన పురుగు మందులు డబ్బాలు, ప్యాకెట్లపై ఏవైనా అనుమానాలు ఉంటే క్యూఆర్ కోడ్లను స్కానింగ్ చేసి, వ్యవసాయాధికారికి ఫిర్యాదు రూపంలో అందజేయాలని రైతులకు తెలియజేశారు. డీలర్లు పురుగుమందులు, ఎరువులను కానీ అథరైజుడ్ డిస్ట్రిబ్యూటర్ వద్ద కొనుగోలు చేయాలని లేనియెడల సంబంధిత దుకాణదారులపై పురుగు మందుల చట్టం 1968, ఎఫ్‌సిఓ 1985 చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవడంతో పాటు లైసెన్స్ రద్దు చేస్తామని డీలర్లను హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి కే. దేవదాసు గ్రామ వ్యవసాయ సహాయకులు వై.ప్రభాకర్ పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం చూపండి..

- రైతులు తీసిన గండి పూడ్చివేత
- మళ్లీ వానొస్తే.. మా పొలాలు మునగాల్సిందేనా?
- ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు


శనివారం ఉదయం పూడివేసిన గండి ఇన్‌సెట్‌లో వర్షపు నీరు బయటకు పోయేందుకు రైతులు తీసిన గండి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

40 రోజుల అనంతరం స్థానిక కెఎల్‌యు వైపు నుండి గుండి మెడ వెళ్ళు రహదారిపై పంట పొలాలలో వర్షపు నీరు పోయేందుకు రైతుల కొట్టిన గండిని శనివారం ఉదయం స్థానికులు పూడ్చివేశారు. ఇటీవల అకాల వర్షాలు, భారీ వర్షాల కారణంగా గడిచిన మూడు నెలల కాలంలో విపరీతంగా వర్షాలు పడి తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో పల్లంగా ఉన్న పొలాలలో వర్షపు నీరు చేరి పంటలన్నీ నీట మునిగాయి. సెప్టెంబర్ 25వ తేదీన కేఎల్ యు, గుండిమెడ రోడ్డు పై స్థానిక రైతులు కౌలు రైతులు అడ్డంగా గండి కొట్టి వర్షపు నీటిని బయటకు పెట్టారు. దీంతో 40 రోజులకు పైబడి ఆ మార్గం గుండా రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. రైతులు కొట్టిన గండిని సిపిఎం పార్టీ నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు , రైతు సంఘాల నాయకులు పరిశీలించి , రైతుల పంట పొలాలు మునగకుండా కల్వర్టు నిర్మాణం చేపట్టి, పంట పొలాల డ్రైనేజీ కాలువ పూడిక తీయించి , రైతుల పంటలను రక్షించాలని అధికారులను కోరారు. వర్షాలు కురిసి, పంట పొలాలలో చేరిన వర్షపు నీరు వారం పది రోజులుగా పొలాలలోని నిలిచి ఉండడంతో నీళ్లలో నానిన పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. రైతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెట్టే దిశగా తాడేపల్లి వ్యవసాయ, మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుకి క్రింద తూములు ఏర్పాటు చేసి, కల్వర్టు నిర్మాణం చేపడతారనుకుంటే, యధావిధిగా రోడ్డును పూడ్చివేసారంటూ పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. మళ్లీ వాన వస్తే... మా పంట పొలాలు మొనగాల్సిందేనా?.. శాశ్విత పరిష్కారం మార్గం చూపెట్టారా? అంటూ పెదవిరుస్తున్నారు.

ఎరియర్స్ వెంటనే చెల్లించాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ఎయిమ్స్ కార్మికులకు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.బాలాజీ కోరారు. మంగళగిరి ఎయిమ్స్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులకు, కార్మికులకు వెంటనే ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న నిరసన శనివారం ఐదో రోజుకు చేరింది. బాలాజీ మాట్లాడుతూ ఎరియర్స్ చెల్లించాలని కోర్టు తీర్పు చెప్పినప్పటికీ యాజమాన్యం అమలు చేయడం లేదని విమర్శించారు. 2019 సంవత్సరంలో చదువుకొని ఉపాధి కోసం ఉద్యోగాలు లేక సెక్యూరిటీ గార్డులుగా ఉద్యోగాలు చేసిన వారు ఏరియర్స్, బోనసులు కాంట్రాక్ట్ యాజమాన్యం ఇవ్వలేదని దీనిపై సిఐటియు ఆధ్వర్యంలో హైదరాబాద్ లేబర్ కోర్టులో కేసు వేయడం జరిగిందని తెలిపారు. ఏరియస్ చెల్లించమని కోర్టు తీర్పు చెప్పినప్పటికీ యాజమాన్యం కార్మికులకు చెల్లించలేదని అన్నారు. వెంటనే ఈ సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.బుజ్జి బాబు, రవి, ఎ.శ్రీనివాసరావు, కె.సతీష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎం.బాలాజీ



నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు , పూలమాల వేస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ

కొల్లి అచ్చిరెడ్డికి సిసిఎం నాయకుల నివాళి

ప్రజాశక్తి - పెదకాకాని

సిపిఎం మాజీ కార్యదర్శి కొల్లి అచ్చిరెడ్డి మరణం పార్టీకి తీరని లోటని పలువురు కొనియాడారు. శనివారం మండల పరిధిలోని నంబూరు గ్రామంలో అచ్చిరెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అచ్చిరెడ్డికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ కొల్లి అచ్చిరెడ్డి నంబూరు గ్రామ సిపిఎం మాజీ శాఖ కార్యదర్శిగా పనిచేశారన్నారు. ఆయన పేదల కోసం ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఆయన లేని లోటు తీర్చలేదన్నారు. అనంతరం అచ్చిరెడ్డి భౌతికయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ సిపిఎం శాఖా కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, నాయకులు జి.రాజా రమేష్, జొన్నల అప్పి రెడ్డి, అన్నపరెడ్డి వెంకటరెడ్డి, ఈమని సుబ్బారెడ్డి, ఈమని ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

అనాధలకు పోటీలు

ప్రజాశక్తి - పొన్నూరు

విజ్ఞాన్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నేషనల్ సర్వీస్ స్కీమ్‌లో భాగంగా మండల పరిధిలోని బ్రాహ్మణ కోడూరు చైల్డ్ హోమ్‌లో అనాధ పిల్లలకు శనివారం పలు పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్స్, క్విజ్, రన్నింగ్ రేస్, లెమన్ స్పూన్, డ్రాయింగ్ తదితర అంశాలలో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. చైల్డ్ హోమ్ అనాధలకు పండ్లు స్వీట్లు పుస్తకాలు తదితరాలు పంపిణీ చేయడం జరిగింది.. కార్యక్రమంలో విజ్ఞాన్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ వింగ్ విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మజూరి పెంచాలని 12న నేతన్నల భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - మంగళగిరి

చేనేతలకు మజూరి పెంచాలని, లేకపోతో ఈనెల 12వ తేదీన భారీ ప్రదర్శన నిర్వహిస్తామని చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ సమావేశం హెచ్చరించింది. శనివారం కమిటీ సమావేశం జరిగింది. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,, చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ మెంబర్, పిల్లలమర్రి నాగేశ్వరరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో పెరిగిన ముడి సరుకు ధరలు, పెరిగిన జీవన వ్యయాలను పరిగణనలోకి తీసుకుని చేనేత కార్మికులకు కనీసం 40 శాతం మజూరి పెంపు ఇవ్వాలని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.. ఈ నేపథ్యంలో చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ


చేనేత కార్మికుల వేతనాల పెంపు కోసం సమావేశమైన చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ

నిర్ణయించినట్లుగా తెలిపారు. ఈనెల 12వ తేదీన పాత మంగళగిరి శ్రీ భద్రావతి సమేత భావనా ఋషి సేవాసంఘం కళ్యాణ మండపం వద్ద నుండి చేనేత కార్మికుల భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం మాస్టర్స్ వీవర్స్ అసోసియేషన్ వారికి మెమోరాండం సమర్పించనున్నారు. చేనేత కార్మికులు ఈ ప్రదర్శనలో ఐకమత్యంగా పాల్గొనాని ఆయన కోరారు. ఈ సమావేశంలో చేనేత రంగానికి సంబంధించిన కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగమే దేశంలో అతిపెద్ద ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న రంగమని, వేలాది కుటుంబాలు ఈ రంగంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ రంగం పతనమైతే ఉపాధిపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మాస్టర్స్ వీవర్స్ అసోసియేషన్ చేనేత కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకుని న్యాయమైన మజూరి పెంపుపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు.చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ నాయకులు, గుత్తికొండ ధనుంజయ్ రావు, రామనాథం పూర్ణచంద్ర రావు, డోకుపర్తి రామారావు, కూరపాటి కోటేశ్వరరావు, కౌతవరపు వెంకటేశ్వరరావు, బత్తుల గిరి, దొడ్డి ఈశ్వరరావు, భీమిశెట్టి బాల తేడేరు, వి.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ములకా శివసాంబిరెడ్డి

రైతుసంఘం మహాసభకు తరలిరండి

ప్రజాశక్తి - తెనాలి

సోమవారం జరిగే ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డివిజన్ మహాసభలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం జగ్గడిగుంట పాలెం, పెదరావూరు, నేలపాడు, ఐతానగర్ గ్రామాల్లో ఆయన రైతులను కలిశారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించటం లేదని, కనీసం ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు కొన్న నాధుడు లేక అన్నదాతలు అగచాట్లు పడుతున్నారన్నారు. గత నెలలో వచ్చిన తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతుల పొలాలను అధికారులు ఎన్యుమరేట్ చేయకపోవడం అన్యాయం అన్నారు. దాదాపు రెండు సంవత్సరాలు గడుస్తున్నా దుగ్గిరాల శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజ్ అగ్ని బాధిత పసుపు రైతులకు పూర్తి పరిహారం ఇచ్చేందుకు ప్రభుత్వం కృషి చేయకపోవడం బాధాకరమన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాయపాటి గోపాలకృష్ణ తదితరులు

డిసెంబర్ 23, 23 తేదీల్లో ఆర్‌విఆర్ అండ్ జెసి అగ్రిటెక్ హ్యాకథాన్

ప్రజాశక్తి - గుంటూరు

రైతుల సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను అందించాలనే లక్ష్యంతో తమ కళాశాలలో ఆర్‌విఆర్ అండ్ జెసిసి ఈఎస్‌టిపి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ ఆధారిత సంస్థల సహకారంతో డిసెంబర్ 22, 23 తేదీల్లో నేషనల్ అగ్రిటెక్ హ్యాకథాన్ 2025 కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కళాశాల అధ్యక్షులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేని తెలిపారు. హ్యాకథాన్ పోస్టర్‌ను కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమానికి సంబంధించిన ఆన్లైన్ రిజిస్ట్రేషన్ వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో ఐటిబిఐ ప్రన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ ఎమ్.వి.పి. చంద్రశేఖర్ రావు, సిఈఓ డాక్టర్ ఆర్. హాఫీజ్‌బాషా, ఇంక్యూబేషన్ మేనేజర్ డాక్టర్ శోభా, డాక్టర్ ముద్దు అల్లపర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థినులు

విద్యతోనే వికాసం : ఐద్వా

ప్రజాశక్తి-తాడేపల్లి

విద్యతోనే సమాజ వికాసం సాధ్యమని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) రాష్ట్ర కోశాధికారి దొంతిరెడ్డి శ్రీనివాస కుమారి అన్నారు. తాడేపల్లి సుందరయ్య నగర్ లో శనివారం జరిగిన కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆంధ్రభూమి విశ్రాంత సీనియర్ జర్నలిస్ట్ స్వాతి మాట్లాడారు. ప్రజాశక్తి టెక్నీకల్ ఇంచార్జి సురేంద్ర మాట్లాడుతూ టెక్నీకల్‌గా వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్‌లు అందజేశారు. సభకు మహిళా సంఘం బాధ్యులు ఉష అధ్యక్షత వహించారు. మార్క్సిస్టు సంపాదకులు ఎస్. వెంకట్రావు వక్తలను సభకు పరిచయం చేశారు.

ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి - మాచర్ల



మాట్లాడుతున్న మరియదాసు

మాచర్ల రూరల్ మండలంలోని పిఎం జన్‌మన్ స్కీమ్ కింద పక్కా గృహం లేని చెంచువర్గాలు గృహాలు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల హౌసింగ్ ఏఈ మరియ దాసు తెలిపారు. నాగులవరం పంచాయతీ పరిధిలోని బీకె పాలెం, బీకె పాలెం చెంచుకాలనీ, సుబ్బారెడ్డి పాలెం, బోదనంపాడు, బోద నంపాడు చెంచు కాలనీ నివాసులై, ఎరుకుల, యానాది, సుగాలీలు వర్గాలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాల న్నారు. పిఎంఎవై 2.0 పథకం కింద మాచర్ల మండలంలోని ఇల్లులేని నిరుపేదలైన అన్ని వర్గాల వారు హౌసింగ్‌కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.



ర్యాలీగా తరలి వస్తున్న వర్లరామయ్య, ఎమ్మెల్యే, తదితరులు

వైసిపిని వీడి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణం 5వవార్డు క్రిస్టియన్‌పాలెంలో వైసిపికి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. 150 కుటుంబాలు స్వచ్ఛందంగా వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. శుక్రవారం రాత్రి నిర్వహించిన సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్లరామయ్య మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎస్‌సి వర్గీకరణ చేసిన మొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు టిడిపి మాదిగల పార్టీ అని అన్నారని గుర్తు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ నరసరావుపేటలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి నియోజకవర్గంలో హత్యా రాజకీయాలతో అరాచకపాలన సాగించారన్నారు. అడ్వకేట్ మల్లెల అశోక్‌తో పాటు 120 ఎస్‌సి కుటుంబాల చేరడం సంతోషంగా ఉందన్నారు. ఇదే ఉత్సాహంతో 2029 ఎన్నికల్లో టిడిపిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. లీడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ మాదిగ సోదరులు టిడిపికి వెన్నెముకనీ, వారి సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. టిడిపి పట్టణ అధ్యక్షులు గట్టుపల్లి సత్యనారాయణ, నాయకులు కొట్టా కిరణ్‌కుమార్, కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యమే భవిష్యత్ జీవన విధానం

ప్రజాశక్తి - విజయపురిసౌత్



కషాయాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

ప్రకతి సేద్యమే భవిష్యత్ జీవన విధానమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మా నందరెడ్డి అన్నారు. శనివారం మాచర్ల మండలంలో పర్యటించిన ఆయన పెద్ద అనుపు గ్రామంలో శ్రీ రంగనాథ స్వామి సహజ ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ సహజ సిద్ధంగా తయారు చేస్తున్న కషాయాలను, ప్రకృతి వ్యవసాయానికి సిద్ధం చేసిన ఎరువులను పరిశీలించి, వాటిని వాడే పద్ధతులను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ రైతుల మూసధోరణి యాజమాన్య పద్ధతులు నుంచి ప్రకృతి వ్యవసాయంవైపు మరలినప్పుడు వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రకృతి వ్యవసాయంతో పండించే ఉత్పత్తులకే ప్రపంచ విఫణిలో మంచి డిమాండ్ ఉంటుందని జోష్యం చెప్పారు. గురజాల ఆర్డీవో మురళి, తహశీల్దార్ కిరణ్‌కుమార్, జూలకంటి అక్కిరెడ్డి మాచర్ల రూరల్ టిడిపి నాయకులు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ దుర్గారావు కార్యకర్తలు పాల్గొన్నారు.

కొన్ని నెలలుగా తాళం వేసిన ఇళ్లకూ బిల్లుల బాదుడు

ప్రజాశక్తి-చిలకలూరిపేట



ఖాళీగా ఉన్న గంగిరెడ్డి ఇంటికి వచ్చిన కరెంటు బిల్లు

స్థానిక మండల పరిధిలోని మాను కొండు వారిపాలెంకు చెందిన తియ్య కూర గంగిరెడ్డి మూడు నెలలుగా ఇంట్లో ఉండటం లేదు. విద్యుత్ వాడు కోవడం లేదు. అయిన నెలనెలా విద్యుత్ బిల్లులు వస్తున్నాయని వాపోతున్నా రు. విద్యుత్ బిల్లుల బాదుడుకు పల్లె పట్టణాలు అనే తేడా లేదంటున్నారు. అందులోనూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అదనపు చార్జీలు పూర్తిగా రద్దు చేస్తామని, విద్యుత్ యూనిట్ల రేట్లు తగ్గిస్తామని చెప్పారు. అధికారంలోకి వచ్చి 18 నెలలు కావస్తున్నా బిల్లుల వసూలులో ఎలాంటి మార్పు లేదని వినియోగదారులు వాపోతున్నారు. 2023 సంవత్సరం తొమ్మిదో నెల నుంచి 25వ సంవత్సరం వరకు అదనపు చార్జీలు విధిస్తూనే ఉన్నారు. విద్యుత్ ఏమి వాడకపోయినా సర్ఫిక్స్ ఛార్జీల కింద రూ.10లు, కస్టమర్ చార్జీలు కింద రూ.25లు ట్రూ డౌన్ చార్జీల క్రింద రూ.17.32 పైసలు, ఎఫ్‌పిపిసిఏ చార్జీల కింద ఇప్పటి వరకు రూ.132లు విధించారని వినియోగదారులు వాపోతు న్నారు. ఇప్పటికైనా వెంటనే అదనపు చార్జీలు సర్‌చార్జీలు పేరుతో విధిస్తున్న అదనపు చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతున్నారు.

ప్రజా సమస్యల జవాబుదారీ వేదిక ప్రజాదర్బార్ : ఎమ్మెల్యే



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - వెల్దుర్తి

ప్రజా సమస్యలకు జవాబుదారీ వేదిక ప్రజాదర్బార్ అని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అనేక సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాల మెట్లు ఎక్కుతున్న ప్రజలకు అక్కడ సత్వర పరిష్కారం కాకపోవడంతో ఎమ్మెల్యే ఇంటి గడప తొక్కాల్సిన పరిస్థితి వస్తోందని అన్నారు. సమస్య ప్రాథమిక దశలోనే స్థానిక అధికారులు పరిష్కరిస్తే.., ప్రజాప్రతినిధుల వద్దకు క్యూకట్టాల్సిన అవసరం ఉండదని చెప్పారు. ప్రజాదర్బార్‌కు 56 అర్జీలు వచ్చాయని ఎమ్మెల్యే తెలిపారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే పరిష్కారానికి సంబంధిత అధికారులకు పంపించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. గురజాల ఆర్డీవో మురళీ, మాచర్ల తహశీల్దార్ కిరణ్ కుమార్, వెల్దుర్తి ఎస్సై సమందర్ వలి, వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ కొమెర దుర్గారావు, ఎస్సీ కార్పోరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్, మాచర్ల మార్కెట్ యార్డ్ చైర్మన్ రాజబోయిన మధు, టీడీపీ ఎస్టీ సెల్ అధ్యక్షులు వజ్రం నాయక్, టీడీపీ సీనియర్ నాయకులు జూలకంటి చిరంజీవి రెడ్డి, యువనాయకులు జూలకంటి అక్కిరెడ్డి, కేశిరెడ్డి హనిమిరెడ్డి, భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

శ్రీ గణేష్ నా అనుచరుడు కాదు

మాజీ మంత్రి విడదల రజిని

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



మాట్లాడుతున్న విడదల రజిని

తనకు చట్టంపై అపారమైన గౌరవం ఉందనీ కానీ కొందరు పోలీసుల పని తీరు చూస్తే బాధ కలుగుతోందని మాజీ మంత్రి విడదల రజిని అన్నారు. తనపై వస్తున్న అవినీతి ఆరోపణలలో వాస్తవం లేదని తనపై కావాలనే అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. శనివారం ఆమె ఎస్‌పి కార్యాలయంలో ఎస్‌పిని కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కొద్ది రోజులుగా తన పట్ల పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. రాజకీయ దురుద్దేశ్యంతో తనపై, తన అనుచరులపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. నా సన్నిహితుడని చెబుతున్న శ్రీ గణేష్ చౌదరి గత ఎన్నికల్లో దర్శి టిడిపి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి ప్రచారంలో పాల్గొని కీలకంగా పని చేశారని గుర్తు చేశారు. శ్రీ గణేష్ ప్రత్తిపాటి పుల్లారావు అనుచరుడనీ, రూ 35లక్షలు శ్రీ గణేష్ 10 ఏళ్ల కిందట తీసుకుంటే తనపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టిడిపి మైనారిటీ సెల్ అధ్యక్షులు మాబు సుభాని శ్రీ గణేష్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలపై చిలకలూరిపేట టౌన్ స్టేషన్‌లో రాజీ ఒప్పందం చేసుకుని ప్రస్తుతం తనపై ఆరోపణలు చేయడం తగదన్నారు. పోలీసులు పూర్తిగా అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. డిఎస్‌పి తన వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని వారిపై పరువు నష్టం దావా వేస్తానని చెప్పారు. తనపై టిడిపి కూటమి ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టిలతో పెట్టించిన ఏడు కేసులను చట్ట ప్రకారం ఎదుర్కొంటామని చెప్పారు.

ఎఎం రెడ్డి కాలేజీలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నరసరావుపేట మండలం పెట్లూరివారిపాలెం గ్రామ పరిధిలోని ఏ.ఎం.రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాస రెడ్డి పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్, బి.ఫార్మసీ, డిప్లొమా కళాశాలల విద్యార్థులు పాల్గొని 53 మంది రక్త దానం చేశారు. శిబిరాన్ని ఏ.ఎం.రెడ్డి విద్యా సంస్థల ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్‌క్రాస్‌సొసైటీ సంయుక్తంగా నిర్వహించాయి. రక్తదానం చేసిన విద్యార్థులకు నరసరావుపేట హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ శాఖ ప్రతినిధులు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్. మల్లికార్జున, బి.ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.భార్గవ భూషణరావు, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి పాల్గొని రక్తదానం ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు వివరించారు. తన పుట్టినరోజు సందర్భంగా రక్తదానం చేసిన విద్యార్థులకు శాంతి శ్రీనివాసరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. రక్తదానం మానవ సేవలో ఒక మహత్తరమైన కార్యమని విద్యార్థులు ఇలాంటి సామాజిక సేవాకార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.

అన్నం పెట్టడం... ప్రాణాన్ని నిలబెట్టడమే

ప్రజాశక్తి - పెదకూరపాడు

అన్నం పెట్టడమంటే ప్రాణం నిలబెట్టడమేనని బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు అన్నారు. పెదకూర పాడుకు చెందిన ఆర్తిమళ్ల శేషయ్య, జానకి దంపతుల కుమార్తె హేమశ్రీ, నేతాజి వివాహం సందర్భంగా పెదకూరపాడు మండలంలోని 75 త్యాళ్ళూరు శాంతి కాలనీలో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జన చైతన్య సమితి కార్యదర్శి తుల్లూరి సాంబశివరావు మాట్లాడుతూ పేదవారికి భోజనాలు ఏర్పాటు చేసిన శేషయ్య కుటుంబీకులు అభినందనీయులన్నారు. ఏ. వెంకట రావు, జి. వసంతరావు, జనచైతన్య సమితి ప్రతి నిధులు బి.నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 250 మందికి అన్నదానం చేశారు.



విద్యార్థులకు హుమతులు అందజేస్తున్న డీఈవో

వృత్తి విద్య కోర్సులతో భవిష్యత్

ప్రజాశక్తి - రెంటచింతల

పాఠశాల దశలోనే విద్యార్థులు వృత్తి విద్య కోర్సులు అభ్యసిస్తే ఉద్యోగ నైపుణ్యాలు లభించి మంచి భవిష్యత్తు ఉంటుందని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ కె. పాపయ్య చెప్పారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఐటీ, ఆటోమోబైల్ ఇంజ నీరింగ్ విభాగాల్లో సత్తెనపల్లిలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన పోటీల్లో 9, 10 తరగతులకు చెందిన 13 మంది విద్యార్థులు పాల్గొని జిల్లా స్థాయిలో మూడవ బహుమతిని కైవసం చేసుకుని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు వి.స్వప్న, వెంకట రామయ్య, జనార్దన్‌రావు ఆజనేయులు, శ్రీధర్ పలువురు విద్యార్థుల్ని అభినందించారు.



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిఐ నఫీజ్ బాషా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి - విజయపురిసౌత్

ఆటోల్లో ప్రయాణికులను పరిధికి మించి ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవని మాచర్ల రూరల్ సీఐ నఫీజ్ బాషా హెచ్చరించారు. శనివారం మాచర్ల మండలంలోని కొత్తపల్లి జంక్షన్ వద్ద ప్రయాణికులకు, డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అధిక లోడుతో వెళ్తున్న ఎనిమిది ఆటోలపై అపరాధ రుసుము విధించారు.అనంతరం సిఐ నఫీజ్ బాషా మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పని సరిగా లైసెన్సులు కలిగిఉండాలన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

12న వైసిపి ర్యాలీలు

ప్రజాశక్తి - మాచర్ల

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ ఈనెల 12న నిర్వహించే ర్యాలీ జయప్రదం చేయాలని పల్నాడు జిల్లా వైసిపి అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, ప్రజలకు పిలుపునిచ్చారు. పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లు ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా ఈనెల 12న బుధవారం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో కార్యక్రమం చేపట్టనున్నట్లు పిన్నెల్లి తెలిపారు. అనంతరం ర్యాలీకి సంబంధించి పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వందేమాతరం ఒక స్ఫూర్తి

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

స్వాతంత్ర్య సంగ్రామంలో వందేమాతరం స్లోగన్ మనకు స్ఫూర్తిని ఇచ్చి స్వాతంత్రాన్ని తెచ్చింది అని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అబ్జర్వర్ సీనియర్ లెక్చరర్ డాక్టర్ జి. వెంకట్రామిరెడ్డి అన్నారు. పట్టణంలోని చక్రధర్ డిగ్రీ కళాశాలలో జరిగిన 150 సంవత్సరాల వందేమాతరం ఉత్సవాలలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం వందేమాతరం గీతాన్ని ఆలాపించారు. స్వాతంత్ర్య సంగ్రామాన్ని గురించి డైరెక్టర్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కుర్రి సాయిమార్కొండా రెడ్డి, అధ్యాపకులు ఎన్ఎఫ్ఎస్ రాణి, జయ, రాజ్యలక్ష్మి, ఎల్. మమత, గురువయ్య పాల్గొన్నారు.

మంచి అలవాట్లపై అవగాహన

ప్రజాశక్తి - యడ్లపాడు

వ్యక్తిగత శుభ్రత, మంచి అలవాట్లపై నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ అధ్యక్షురాలు ఎస్.సంతపేట. ఎస్.కొండవీడు కోటఉరుదు, ఎస్‌హెచ్‌డబ్ల్యు కొండవీడు, ఎస్ కొత్తపాలెం ఎంపిపి, జడ్పీ హెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫౌండేషన్ ఉప అధ్యక్షుడు ఎండేటి ప్రసాదరావు, స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మంత్రి నాదెండ్ల

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - తెనాలి

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక బోస్ రోడ్డులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. నియోజకవర్గంలో 28 మంది లబ్ధిదారులకు రూ.15.09లక్షల విలువైన చెక్కులను అందజేసినట్లు చెప్పారు. అనారోగ్య పరిస్థితులలో పేదలు అధైర్య పడాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

11న రైతు సంఘం మండల మహాసభ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మంగళగిరి మండలం రైతు సంఘం మండలం మహాసభ 11వ తేదీ మంగళవారం కాజా గ్రామంలో నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం రైతు సంఘం మండల కార్యదర్శి తమ్మా ప్రసాద రెడ్డి శనివారం తెలిపారు. ఈ మహాసభ కు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్నా శివశంకర్ హాజరు కానున్నారని చెప్పారు. మహాసభలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించనున్నట్లు, అదేవిధంగా రైతు సంఘ కార్యాచరణ పై కూడా ప్రణాళిక చేయనున్నట్లు తెలిపారు.



చెక్కు అందజేస్తున్న టిడిపి నాయకులు

ఎల్‌బసి చెక్కులు అందజేత

ప్రజాశక్తి - తాడేపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న తాడేపల్లి 19వ వార్డు కె,ఎల్,రావు కాలనికి చెందిన చల్లా వెంకటేశ్వర్లుకి, 12వ వార్డు నులకపేటకు చెందిన షేక్ సైదావలి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) చెక్కులను టిడిపి నాయకులు శనివారం అందజేశారు. టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు, నియోజకవర్గ పరి శీలకులు ముమ్మడి సత్యనారాయణ, భాధితుల ఇంటికి వెళ్ళి మంజూరు పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇట్టా భాస్కర్, కొమరం చిన్నబచ్చయ్య, సైకం సాంబయ్య, షేక్ అమీర్, కొయ్యగోర మల్లేశ్వర రావు, షేక్ మస్తానయ్య, షేక్ రహీం ం పాల్గొన్నారు.



పోటీలలో పాల్గొన్న బాలికలు

బాలకళ ప్రభ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు

బాలానంద కేంద్రం రుద్ర కళాక్షేత్రం సహకారంతో రెండ్రోజులపాటు నిర్వహించే బాలకళా ప్రభ 2025 శనివారం ప్రారంబమయ్యాయి. బ్రాడీపేట బాలానంద కేంద్రంలో సంస్థ అధ్యక్షులు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి నృత్యోత్సవాలు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల బాలికలలో విద్యతోపాటు మానసిక వికాసానికి లలితకళలు దోహదం చేస్తాయని చెప్పారు. తాము చేస్తున్న కృషికి తల్లిదండ్రులు మరింతగా సహకరించాలని కోరారు. రుద్ర కళాక్షేత్రం నిర్వాహకులు మాచిరాజు రాజేష్ మాట్లాడుతూ రెండ్రోజుల పిల్లల పండుగ ద్వారా తెలుగు పద్యం, సంస్కఅత శ్లోకం, శాస్త్రీయ, జానపద నృత్యం, చిత్రలేఖనం, వాద్యసంగీతం, శాస్త్రీయ సంగీతం తదితర అంశాలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో బాలానంద కేంద్రం ప్రధాన కార్యదర్శి నడింపల్లి వెంకట గురుదత్, కార్యవర్గ సభ్యులు, బి.శ్రీనివాస్ కట్టమూరి నాగ రాజారావు, మాచిరాజు జ్యోతి, అకడమిక్ డైరెక్టర్ వై ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

సమస్య ఏదైనా మా దృష్టికి తీసుకురండి

సిఐ వీరేంద్రబాబు - కుంచనపల్లి ఎస్సీ కాలనీలో పోలీసుల పల్లె నిద్ర

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

గ్రామీణ ప్రాంతాలలో ప్రజలకు ఏ విధమైన సమస్య వచ్చినా 112, 100 నంబర్‌కి కాల్ చేసి తెలియజేయాలని తాడేపల్లి మండల సిఐ వీరేంద్రబాబు తెలిపారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు శుక్రవారం రాత్రి కుంచనపల్లి దళితవాడ అంబేద్కర్ సెంటర్ వద్ద పోలీసులు పల్లెనిద్ర చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ వీరేంద్రబాబు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించిన, జూదం నిర్వహించిన చట్టరీత్యా నేరమన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు సమస్యలపై సమాచారం ఇస్తే పది నుంచి 20 నిమిషాల లోపు సమస్య ఉన్న చోటికి పోలీసులు వస్తారని అన్నారు. సైబర్ నేరాలు, పోక్స్ ఆక్ట్, ఈవ్‌టీజింగ్ వంటి అంశాలపై ప్రజల అవగాహన కలిగి



మాట్లాడుతున్న సిఐ వీరేంద్రబాబు

ఉండాలన్నారు. అవసరమైన చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ ఖాజా వలి, టిడిపి కుంచనపల్లి గ్రామ అధ్యక్షులు కానుగోలు కోటేశ్వరరావు, జనసేన గ్రామ అధ్యక్షులు మేకల రాజా, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక సేవతో నాయకత్వ నైపుణ్యం : రిజిస్ట్రార్ సింహాచలం



ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

సమాజం నుండి నేర్చుకోవడానికి, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి సామాజిక సేవ దోహదపడుతుందని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. సింహాచలం అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ -1 విభాగం ఆధ్వర్యంలో నంబూరు గ్రామంలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) ప్రత్యేక క్యాంపు శనివారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సింహాచలం మాట్లాడుతూ విద్యార్థులు, వాలంటీర్లు అంకితభావంతో సామాజిక సేవ చేస్తే దేశాన్ని ఏకీకృతం చేయవచ్చని అన్నారు. విద్యార్థులకు సమాజంలోని సమస్యలను తెలుసు కోవడానికి ఇలాంటి క్యాంపులు ఉపయోగపడ తాయన్నారు. వాలంటీర్లను ఆయన అభినందించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కె.సుజన డ్రగ్స్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్, పౌష్టిక ఆహారం గురించి అవగాహన కల్పించామని తెలిపారు. అనంతరం స్వచ్ఛంద సేవకులు తమ అనుభవాలను పంచుకున్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ తేజ మూర్తి, వర్సిటీ బాలుర వసతి గఅహాల డిప్యూటీ వార్డెన్ డాక్టర్ ఎన్. బాబు, కళాశాల సిబ్బంది నంబూరు రత్న కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ చేబ్రోలు మండల నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులుగా పి.పార్థసారథి, షేక్ ఖాదర్ బాషా ఏకగ్రీవం

ప్రజాశక్తి - చేబ్రోలు

యుటిఎఫ్ చేబ్రోలు మండల కమిటీ అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులుగా పి.పార్థసారధి, షేక్ ఖాదర్ భాషాలను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యుటిఎఫ్ మహాసభను స్థానిక కార్యాలయంలో శనివారం నిర్వహించారు. సభకు ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు హాజరయ్యారు. సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ డిసెంబర్‌లో యుటీఎఫ్ జిల్లా మహాసభలు చేబ్రోలులో నిర్వహిస్తున్నామని తెలిపారు. మహాసభలు జయప్రదం కావడానికి సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఐ.అర్. ప్రకటించి నూతన పీఆర్సీ కమిటీ చైర్మన్‌ని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా కార్యదర్శి జి.వెంకటేశ్వరరావు ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కమిటీ గౌరవ అధ్యక్షులుగా ఐ.శ్రీనివాస్ రెడ్డి, సహాధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, మహిళా అధ్యక్షులు షేక్ రిజ్వానా బేగం, కోశాధికారిగా కె.శ్రీనివాసరావు మండలం కార్యదర్శిలుగా ఎన్.విజయలక్ష్మి, ఎం.శ్రీనివాసరావు, సతీష్ చంద్రబాబు, రాంబాబు, శివ కోటేశ్వరరావు, అర్షతున్నీసా బేగం, కె.శ్రీనివాసరావు, కె.ఏసుబాబు, శంకర్ లను, జిల్లా కౌన్సిలర్లుగా ఐదుగురిని, జిల్లా కార్యవర్గ సభ్యులుగా 22 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్విమ్మింగ్ పోటీల్లో వడ్డేశ్వరం జెడ్పీ హైస్కూల్ బాలికల హవా

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

విశాఖపట్నంలో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీలలో ఎం టి ఎం సి పరిధిలోని వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థినిలు మూడు గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న షేక్ నజరీన్, షేక్ నస్రీన్‌లు తమ ప్రతిభను కనబరిచి, విజయాలు సాధించడమే కాక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు, గ్రామానికి మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకువచ్చారని ఆయన అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి శక్తి వంచన లేకుండా కృషిచేసి విజయాలు సాధించాలని ఆయన కోరారు. విజయాలు సాధించిన ఇద్దరు క్రీడాకారులను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు నూతక్కి రవి, మెల్లంపూడి రవి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. పలువురు గ్రామస్తులు ఎస్.కె.నజరీన్, ఎస్.కె.నస్రిన్ లను అభినందించారు.




గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన వడ్డేశ్వరం జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థినిలు

చల్లావారిపాలెంలో ఎన్‌ఎస్‌ఎస్ క్యాంప్

ప్రజాశక్తి - గుంటూరు

స్టానిక చల్లావారిపాలెం గ్రామంలో గుంటూరు టిజెపిఎస్ కాలేజి జాతీయ సేవా పథకం వారి ఆధ్వర్యంలో వారం రోజులపాటు నిర్వహించనున్న ప్రత్యేక శిబిరం శనివారం ప్రారంభమైంది. మెడికల్ సర్వే, ఉచిత వైద్యశిబిరం, మొక్కలు నాటటం, సిపిఆర్ అవగాహన కార్యక్రమం, మత్తుపదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమం, నీటి ఆవశ్యకత, ప్రకృతి వైపరిత్యాలపై అవగాహన వంటి వివిధ కార్యక్రమాలు నిర్వహిచంటం జరుగుతుందని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ ఆరుదల సాంబశివరావు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బివిహెచ్.కామేశ్వరశాస్త్రి మాట్లాడారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జె.వి.సుధీర్ కుమార్, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



సర్పంచ్‌కు మెమెంటో అందజేస్తున్న ప్రిన్సిపాల్




దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

340వ రోజుకు సిమెంట్ కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి-తాడేపల్లి

న్యాయంగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 340 రోజులకు చేరుకున్నాయి. దీక్షలను కార్మిక నాయకులు కె.స్టీవెన్, ఎం.ఆశీర్వాదం, బి.అంకయ్య, డినాగేశ్వరావు, గురవయ్య ప్రారంభించారు. దీక్షల్లో దామవరపు సువర్ణ, మొలకశారదా, దేరంగుల రమణమ్మ, వి.లక్ష్మి, దర్శి బేబీమ్మ కూర్చున్నారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరావు, వైపేద సుబ్బారావు, సూర్యప్రకాష్ సుభాని, మాణిక్యారావు, సాంబశివరావు, రమాదేవి, ఇమాంభి, శరమ్మా, రిబ్కా, నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న ఎన్ఎంయు నాయకులు

ఎన్ఎంయు ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి బస్టాండ్ వద్ద ఆర్టీసీ ఉద్యోగులు ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. 1/2019 సర్కులర్ కి విరుద్ధంగా ఒక కేసుకి ఒక పనిష్మెంట్ ఉన్న విధానాన్ని మార్చి రెండు పనిష్మెంట్లు ఇస్తున్నందుకు గాను ఆర్టీసీ ఉద్యోగులు శనివారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఆర్టీసీ డిపో అధికారులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎంయు నాయకులు కోరారు.

కుష్టు వ్యాధిగ్రస్తులకు వితరణ

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని మొరంపూడి గ్రామంలో ఉన్న స్వచ్ఛంద సేవా సంస్థ గ్రేట నా టెస్ట్ నందు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో 30 మంది కుష్టు వ్యాధిగ్రస్తులకు సమస్త వారు డ్రెస్సింగ్ మెటీరియల్స్, మందులు ఉచితంగా అందజేశారు. తెనాలికి చెందిన అమరావతి సర్జికల్స్ వారు వ్యాధిగ్రస్తులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ వంగర హేమ్ చంద్ వ్యాధిగ్రస్తులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. కార్యక్రమంలో సమస్త కరస్పాండెంట్ వంగర ఉదయార్క, సిబ్బంది సిహెచ్ శివకుమార్ జి.రవి వెంకటేశ్వరరావు చందు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



సర్జికల్ కిట్స్ అందజేస్తున్న ఉదయార్క



విద్యార్థులు చారిత్రక వైజ్ఞానిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - చేబ్రోలు

విద్యార్థులు చారిత్రక వైజ్ఞానిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలని నారాకోడూరు పిఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఏడుకొండలు తెలిపారు. శనివారం ఉండవల్లి గృహలను పాఠశాల విద్యార్థులతో కలసి సందర్శించారు. అలాగే సచివాలయం, శాసనసభ శాసన, మండలి సందర్శించినట్లు తెలిపారు. యాత్రలో సైన్స్ ఉపాధ్యాయులు ఎం.వెంకటేశ్వరరావు హరిప్రసాద్ డి.వి. శ్రీనివాస్, డి.పరిశుద్ధం, ఉపాధ్యాయులు సల్మా ఖాటూన్, విశ్వేశ్వరరావు, రాజ్యలక్ష్మి, ప్రసాద్ పాల్గొన్నారు.



గెలుపొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ తదితరులు

చలపతి ఫార్మసీ కాలేజీలో ఈ పోస్టర్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు

లాంలోని చలపతి ఫార్మసీ కాలేజిలో శనివారం ట్రాన్స్‌ఫార్మింగ్ థెరపి విత్ నోవెల డ్రగ్ డెలివరీ సిస్టమ్ అనే అంశంపై జాతీయస్థాయి ఈ-పోస్టర్ పోటీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వివిధ ఫార్మసీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇండి గ్లోబల్ ల్యాబ్స్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.సాంబశివరావు మాట్లాడుతూ ఆధునిక ఔషధ పంపిణీ పద్ధతులు, నోవెల్ డ్రగ్ డెలివరీ సిస్టమ్స్ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులకు దారితీస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఔషధాలను కేవలం తయారు చేయడం మాత్రమే కాకుండా, అవి శరీరంలోని లక్ష్య స్థలానికి సమర్థవంతంగా చేరే విధంగా డిజైన్ చేయడం అత్యంత అవసరమని తెలిపారు. చలపతి ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షులు వై.వి.అంజనేయులు మాట్లాడుతూ ఇలాంటి జాతీయ స్థాయి పోటీలు విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, పరిశోధన పట్ల ఆసక్తిని పెంపొందిస్తాయని అన్నారు. ఈ సందర్భంగా ఫార్మాస్యూటికల్ రంగంలో విద్య, పరిశోధన సహకారాన్ని బలోపేతం చేసే ఉద్దేశ్యంతో ఇండి గ్లోబల్ ల్యాబ్స్, చలపతి ఫార్మసీ కాలేజి మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు, విబాగాధిపతులు పాల్గొన్నారు.

వసతిగృహాల నిర్వహణ అధ్వానం

7 వీక్షణం

కార్పొరేట్ విద్యాసంస్థల వసతి గఅహాల్లో కూడా దయనీయమైన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఏడాదికి నాలుగు లక్షల రూపాయల వరకు ఫీజులు వసూలు చేస్తున్న ఉన్నతమైన విద్యాసంస్థల్లో కూడా నాణ్యమైన ఆహార పానీయాలు అందించలేకపోతున్నారు. పలు విద్యాసంస్థల్లో తమకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని నాసిరకం ఆహారం ఇస్తున్నారని విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు. తాజాగా నీరుకొండలోని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో 300 మంది విద్యార్థులు కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థల్లో ఆహార పానీయాలు నాణ్యంగా లేకపోవడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎస్. ఆర్. ఎం. విశ్వవిద్యాలయంలో 5రోజుల పాటు విద్యార్థులు అస్వస్థతకి గురైనా విశ్వవిద్యాలయం అధికారుల స్పందన సరిగా లేకపోవడంపై తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ సంఘటనలను బాహ్య ప్రపంచానికి తెలియకుండా కప్పిపుచ్చడం ద్వారా సమస్యలు మరింత పెరుగుతాయే కానీ తగ్గవని ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయంలో 300 మంది విద్యార్థుల అస్వస్థత ఘటన నిరూపించింది. పెద్ద సంఖ్యలో విద్యార్థుల స్వస్థత గురైతే అధికారులు సరిగా స్పందించలేదని ప్రభుత్వంపై విమర్శలు రావడంతో ఎట్టకేలకు స్పందించిన జిల్లా కలెక్టర్ విచారణ కమిటీ నియమించారు. విచారణ కమిటీ నియామకం తర్వాత స్పందించిన విశ్వవిద్యాలయం పెద్దలు ఏకంగా 15 రోజులు సెలవులు ఇచ్చారు. శానిటేషన్ డ్రైవ్ చేస్తున్నట్టు విశ్వవిద్యాలయం రిజిస్టార్ ప్రకటించారు. గత నెల 29 ప్రారంభం అయిన విద్యార్థుల అస్వస్థత ఐదు రోజులు కొనసాగింది. కడుపు నొప్పి, వాంతులు, విరోచనాలు సమస్యలతో డయేరియా ప్రబలింది. విద్యార్థులు అస్వస్థతకు గురికావడంపై విశ్వవిద్యాలయంలో కీలకంగా ఉన్న అధికారుల ఉద్యోగులు యాజమాన్యానికి తగిన సమాచారం ఇవ్వలేదని తెలిసింది. దీనివల్ల విశ్వవిద్యాలయం ప్రతిష్ట మంట గలిసింది. విశ్వవిద్యాలయాల నిర్వహణ పై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ప్రభుత్వ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రభుత్వ వసతి గృహాలలో అనేక అసౌకర్యాలు ఉన్నా పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే లక్షలు వసూలు చేస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల్లో కూడా విద్యార్థులు నాణ్యమైన ఆహారం కోసం తరచూ ఆందోళన చేయడం పరిపాటిగా మారింది. తాజా గా ప్రభుత్వ వసతి గఅహాల లో విద్యార్థుల కి సరియైన ఆహారం అందించకుండా బిల్లులు క్లెయిమ్ చేసుకున్న ఘటన గుంటూరు లో వెలుగు చూసింది. సాంఘిక సంక్షేమ శాఖ వసతి గఅహం లో విద్యార్థులు బయట నుంచి ఆహారం, కూరలు తెచ్చుకుని తినడం, సొంతంగా రైస్ కుక్కర్లతో ఆహారం వండుకుని తింటున్నా సంక్షేమ వసతి గఅహా అధికారులు ఆహారం సరఫరా చేసినట్లు రూ. 45లక్షలు బిల్లులు డ్రా చేసుకున్నట్లు తెలిసింది. ఇటీవల పెదనందిపాడు మండలం అనపర్రు లో వసతి గఅహం లో 55మంది విద్యార్థుల అస్వస్థతకి గురయిన ఘటన తరువాత పలు అంశాలు వెలుగు చూసాయి. గ్రామంలో జరిగే ఫంక్షన్స్‌కి విద్యార్థుల ను పంపడం, బయట ఆహారం వసతి గృహం లోకి తీసుకురావడం, మెనూ ప్రకారం ఆహారం సరఫరా చేయడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వసతి గృహాల్లో నెలకొన్న పరిస్థితులపై ఇప్పటి కయినా అధికారులు, ప్రజాప్రతినిధులు తగిన పర్యవేక్షణ చేయాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

- ఎ.వి.డి.శర్మ

పల్నాటి వీరారాధన ఉత్సవాల తేదీలను ప్రకటించిన పీఠాధిపతి

ప్రజాశక్తి - కారంపూడి



పలనాటి వీరుల కొణతల మహోత్సవములు ఈ నెలలోనే ప్రారంభం అవుతాయి అని కారంపూడి పల్నాటి వీరచారపీఠం పిఠాధిపతి పిడుగు. తరుణ్ చెన్నకేశవ శనివారం తెలిపారు. కార్తీక అమవాస్య రోజున కారంపూడి వీర్లగుడి ప్రాంగణంలో వీరుల మహోత్సవాలు ప్రారంభం అవుతాయని ఈ ఉత్సవాలు 5 రోజుల పాటు జరుగుతాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 5 రోజులు జరుగు ఉత్సవాల తేదీలను అయన ప్రకటించారు. నవంబర్ 19 బుధవారం రాచగావు, నవంబర్ 20 గురువారం రాయబారం, నవంబర్ 21 శుక్రవారం మందపోరు, నవంబర్ 22 శనివారం కోడిపోరు, నవంబర్ 23 ఆదివారం కల్లిపాడు పేర్లతో ఉత్సవాలు జరుగుతాయని పిఠాధిపతి తెలిపారు. ఈ సమావేశంలో పీఠం నిర్వాహకులు బొగ్గరం, విజయ్ కుమార్ కూడా పాల్గొన్నారు.





కోలాహలంగా..
బాలోత్సవ్





రెండవ రోజు కొనసాగిన వివిఐటియు బాలోత్సవ్- 2025
పాల్గొన్న వేలాది మంది విద్యార్థులు - యూనివర్సిటీలో పండుగ వాతావరణం

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని నంబూరు గ్రామంలో ప్రపంచ తెలుగు బాలల పండుగ “వివిఐటియు బాలోత్సవ్ 2025” వేడుకలు వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నలాజికల్ యూనివర్శిటిలో చిన్నారుల కేరింతలతో రెండవ రోజు శనివారం కోలాహలంగా జరిగాయి. సుదూర ప్రాంతాల నుండి సందర్శకులు హాజరు కావడంతో బాలోత్సవ్ ప్రాంగణం సందడిగా మారింది. 280 పాఠశాలల నుండి 4000 మంది విద్యార్థులు రెండవ రోజు నిర్వహించిన సబ్ జూనియర్స్ విభాగాల పోటీలలో పాల్గొన్నారు. పోటీలలో భాగంగా జానపద నృత్యాలు, నాటికలు, సంగీతం తదితర అంశాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. 350 జానపద నఅత్యాలు వేదికల వద్ద ప్రేక్షకుల కరతాల ధ్వనులతో సందడిగా సాగాయి. బాలబాలికలచే ప్రదర్శించిన 54 నాటికలు చిన్నారులకు సమాజంపట్ల వున్న దృక్పధాన్ని సామాజిక అవగాహనను వెలికితీసే విధంగా సాగాయి. సమాజానికి హితవు పలికే విధంగా విద్యార్థుల ప్రదర్శించిన నాటికలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కథ, కవిత, లేఖా రచనలు వారిలోని సృజనాత్మకతను వెలికితీసాయి. పోటీలలో పాల్గొన్న విద్యార్థినీ విద్యార్థులకు అనుభవాల మార్పిడి కోత్తధనం నేర్పించటానికి ఉపయోగపడేలా న్యాయ నిర్ణేతలు ప్రత్యేక బోధనలు చేసారు. వాద్య సంగీతంలోని రాగప్రధానం, తాళ ప్రధానం, ఆహుతులను ఆకట్టుకున్నాయి. పోటీల అనంతరం నిర్వహించిన గజల్ శ్రీనివాస్ సంగీత కచేరి చిన్నారులను అలరించింది. తొలి రోజు, రెండవ రోజు విజేతలుగా నిలిచిన చిన్నారులకు వివిఐటి విశ్వవిద్యాలయం ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కొడాలి రాంబాబు, రెడ్ క్రాస్ సొసైటీ గుంటూరు జిల్లా కార్యదర్శి పి.రామచంద్ర రాజు, గజల్ మాస్ట్రో గజల్ శ్రీనివాస్, వివిఐటియు రిజిస్ట్రార్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, బాలోత్సవ్ కన్వీనర్ డాక్టర్ కె.గిరిబాబు బహుమతులు అందించారు.